క్లుప్తంగా

లక్ష్య సాధన కోసం కష్టపడాలి
అంతరిక్ష శాస్త్రవేత్త జాహ్నవి దంగేటి



గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటినుంచి లక్ష్యాన్ని ఏర్పరచుకుని లక్ష్యసాధన కోసం ఎంత శ్రమపడైనా సాధించుకోవాలని ఆస్ట్రనాట్, అంతరిక్ష శాస్త్రవేత్త జాహ్నవి దంగేటి తెలిపారు. శనివారం మండలంలోని లాలుపురం గ్రామంలోని కాటూరి పబ్లిక్ స్కూల్‌ను ఆమె సందర్శించి విద్యార్థులకు భవిష్యత్ మార్గాలపై దిశానిర్దేశం చేశారు. ప్రపంచంలోనే అంతరిక్ష విజ్ఞానంలో మన దేశం అనేక రికార్డులను సాధించిందన్నారు. సుగుణ సైన్స్ అకాడమీ డైరెక్టర్ చివుకుల సాంబశివరావు, పాఠశాల ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

చలపతిలో ముగిసిన శాప్ బీటీపీ శిక్షణ

గుంటూరు రూరల్: సాంకేతిక నైపుణ్యతలను ఎప్పటికప్పుడు విద్యార్థులు మెరుగుపరుచుకోవాలని ఎస్ఏపీ ల్యాబ్స్ ఇండియా సీనియర్ ఇంజినీర్ వి.విజయ్‌కుమార్ తెలిపారు. నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న శాప్ బీటీపీ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఎస్ఏపీ లాబ్స్ సీనియర్ ఇంజినీర్ రాహుల్‌సబ్‌దేవ్, ఎస్ఏపీ యూనివర్సిటీ డైరెక్టర్ ఎలియన్స్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో కల్చరల్ ఫెస్ట్



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో కల్చరల్ కమిటీ, పూర్వ విద్యార్థుల సంఘం, ఐపీఏ లాం లోకల్ శాఖ సంయుక్తంగా బీట్స్ వగాంజ పేరుతో కల్చరల్ ఫెస్ట్‌ను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల సృజనాత్మకత, ప్రతిభకు ప్రాధాన్యమిస్తూ ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అంజని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ వి.బాలభాస్కరరావు, గుంటూరు ప్రభుత్వ వైద్యశాల నాట్కో క్యాన్సర్ సెంటర్ కోఆర్డినేటర్ వై.అశోక్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ కల్చరల్ ఫెస్ట్‌లో నృత్య ప్రదర్శనలు, గానం, నాటకాలు, సినిమా క్విజ్, ఇన్‌స్ట్రుమెంట్ ప్లేయింగ్, ఫ్యాషన్ పరేడ్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఫెస్ట్‌లో పలు జిల్లాల నుంచి 18 కళాశాలలకు చెందిన 734 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పోటీలలో గెలుపొందిన మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలకు కళాశాల అధ్యాపకులు తదితరులు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెదకాకాని: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. మండలంలోని రామచంద్రపాలెం శివారు సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీసు రోడ్డులో గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన ఆ మృత దేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

సెంట్రల్ బ్యాంక్‌లో ఎక్స్‌పోకు విశేష స్పందన

కొరిటెపాడు: గుంటూరు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో మూడు ప్రాంతాలకు (గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం) సంబంధించి ప్రాపర్టీ ఎక్స్‌పో శనివారం నిర్వహించారు. ప్రాపర్టీ ఎక్స్‌పోలో వేలం కోసం 21 ఆస్తులు ప్రదర్శించినట్లు చీఫ్ మేనేజర్ బి.కె.ప్రసాద్ తెలిపారు. సందర్శకులు కొన్ని ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, సందర్శకులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

లక్ష్మీపురం: అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో పేకాటాడుతున్నారన్న స్పెషల్ బ్రాంచ్ సమాచారం మేరకు నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని శనివారం రాత్రి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు.. అరండల్‌పేట 9వలైనులో నలుగురు వ్యక్తులు పేకాటాడుతున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు స్టేషన్ ఎస్ఐ కృష్ణబాజి సిబ్బందితో కలసి దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.19,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

జాడ లేని పల్లె వెలుగు



ప్రధాన రూట్లకే పరిమితమైన బస్సు సర్వీసు

- పట్టణాలకే పరిమితమైన ఆర్టీసీ
- తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోల్లో ప్రయాణం
- ఉచిత బస్సు సౌకర్యం కోసం మహిళల ఎదురు చూపులు

చేబ్రోలు: పల్లె 'వెలుగులు' కనిపించడం లేదు. రవాణ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్లలో ఆటోల్లో నరకం కనిపిస్తోంది. ఆర్టీసీ ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లె వెలుగు సర్వీసుల జాడ కానరావడం లేదు. గ్రామాల్లోని ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది.

ప్రయాణం ప్రమాదకరం...

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం క్షేమంగా ఉంటుందని ప్రచారం చేస్తున్న ఆర్టీసీ మాత్రం ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. చేబ్రోలు మండలంలోని కొత్తరెడ్డిపాలెం, తోట్లపాలెం, శ్రీరంగపురం, గొడవర్రు, గుండవరం, శేకూరుపాలెం గ్రామాలకు ఇప్పటి వరకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్నా అవి వేళకు రాకపోవడంతో గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తోంది. వడ్లమూడి గ్రామంలోకి ఆర్టీసీ బస్సు గతంలో రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం అడ్డరోడ్డు ప్రాంతంలోకి వెళ్లి ఆర్టీసీ బస్సులో ప్రయాణించాల్సి వస్తుంది. గ్రామానికి అడ్డరోడ్డు ప్రాంతానికి సుమారు కి.మీ. దూరం ఉంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజానీకం ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది.

మహిళల ఎదురు చూపులు..



కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. దీనిని డిసెంబర్, జనవరిలో అమలు చేస్తామని ప్రచారం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రతి రోజు పట్టణాలకు..

మండలంలోని వేజండ్ల, సుద్దపల్లి, శలపాడు, వడ్లమూడి గ్రామాల నుంచి ప్రతి రోజు గుంటూరు, తెనాలి పట్టణాలకు వేలాది మంది వ్యవసాయ, తాపీ కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరనాయకునిపాలెం, శేకూరు గ్రామాల నుంచి నుంచి వివిధ పనులపై సమీపంలోని పట్టణాలకు నిత్యం సుమారు వెయ్యి మందికి పైగా వెళ్లి వస్తుంటారు. ఆయా గ్రామాలకు ఒక బస్సు ఉదయం, సాయంత్రం రెండుసార్లు తిరుగుతుంది. అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో ఎక్కువ మంది ఆటోలపైనే ఆధారపడుతున్నారు. దీనిని అవకాశంగా తీసుకొని ఆటోవాలాలు రేట్లను ఇష్టానుసారం పెంచుతున్నారు.

ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిందే...

మండల పరిధిలోని 13 గ్రామాలకు చెందిన వారు చేబ్రోలు మండల కేంద్రానికి రావాలంటే ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సిందే. ఆర్టీసీ బస్సులు సకాలంలో రాకపోవడంతో కళాశాలలకు, పాఠశాలలకు, ఉద్యోగ వ్యాపార పనులకు వెళ్లేవారు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆర్టీసీ సేవలు గ్రామాలకు కల్పించాలనే చిత్తశుద్ధితో బస్సు సౌకర్యం కల్పిస్తే గ్రామస్తులు ఆర్టీసీ బస్సులను ఆదరిస్తారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

తెనాలి వైపు బస్సు సౌకర్యం కల్పించాలి

మండల కేంద్రమైన చేబ్రోలు నుంచి తెనాలికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో చేబ్రోలు- తెనాలి, జూపూడి- తెనాలి, కొత్తరెడ్డిపాలెం- తెనాలి, పొన్నూరు - తెనాలి బస్సు సర్వీసులు కొనసాగించారు. దీని వలన ప్రజలకు కొంత సౌకర్యం ఉంటుంది. తెనాలి వెళ్లాలంటే నారాకోడూరు చేరుకొని అక్కడ నుంచి తెనాలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంజినీరింగ్ కళాశాలలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు వ్యాపారస్తులు వివిధ పనుల కోసం తెనాలి వెళ్లాలంటే రెండు మూడు బస్సులు మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. జూపూడి, కొత్తరెడ్డిపాలెం సర్వీసులను కూడా పునరుద్ధరించాలని ప్రజానీకం కోరుతున్నారు. కొంత కాలం పొన్నూరు- తెనాలి బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. దీని వలన ఆర్టీసీకి మంచి ఆదాయం సమకూరింది. అయినా సర్వీసు ఎత్తివేశారు. తెనాలికి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజానీకం కోరుతున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన



ద్రవజీవామృతం తయారు చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

ప్రత్తిపాడు: బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శనివారం వ్యవసాయ విద్యార్థినులు వట్టిచెరుకూరులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, పంటల సాగులో జీవ ఎరువులు వినియోగించడం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. జీవ ఎరువులను పంటల సాగులో వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వాడటం ద్వారా పంటల దిగుబడి తగ్గడంతో పాటు ఆరోగ్యం పైనా దుష్ప్రభావాలు చూపుతాయని రైతులకు తెలిపారు. అనంతరం రైతులకు ద్రవ జీవామృతం తయారు చేసే విధానంను ప్రయోగాత్మకంగా వివరించారు. జీవామృతాన్ని అన్ని రకాల పంటలకు ఉపయోగించవచ్చని, ఇది పైరు పెరుగుదలకు ఉపకరిస్తుందన్నారు. చీడపీడలను దరిచేరనీయకుండా జీవామృతం కాపాడుతుందని రైతులకు తెలిపారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

డీఎల్‌పీఓ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని డివిజనల్ లెవల్ పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై శనివారం ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి రెండవ రోజు శిక్షణను ప్రారంభించారు. ఎంపీడీఓ కె.శివపార్వతి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్‌పీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలను దశల వారీగా అభివృద్ధి చేసుకోవడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. గ్రామ అభివృద్ధికి ఏమి అవసరం, ప్రాధాన్యక్రమంలో ఏమేమి అభివృద్ధి పనులను చేపట్టాలి.. అన్న అంశాలను గ్రామసభలో నిర్ణయించుకునే అవకాశం ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలకు ఉందన్నారు. ఎంపీడీఓ శివపార్వతి మాట్లాడుతూ స్థానిక సంస్థలకు విడుదలయ్యే నిధులను గ్రామ సమగ్ర అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు షేక్ ఖాజా, మూర్తి సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనుల గుర్తింపు, మహిళా, బాలల గ్రామ సభల ఏర్పాటు, పంచాయతీల పాత్ర, సొంత వనరుల సమకూర్చుకోవడం, పన్నుల వసూళ్లు, వేలంపాటలు.. వంటి అనేక అంశాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ రవికుమార్, వైస్ ఎంపీపీలు షేక్ అఫ్రినాసుల్తానా, తమ్మా రమాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం



ఇన్‌చార్జిలను అభినందిస్తున్న నాయకులు విజయ్‌కుమార్, లింగంశెట్టి ఈశ్వరరావు

లక్ష్మీపురం: కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ఎంపిక చేసినట్లు జరిగిందని జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాచకొండ జాన్ బాబు, తూర్పు ఇన్‌చార్జిగా షేక్ మస్తాన్‌వలి, తెనాలి ఇన్‌చార్జిగా చందు సాంబశివుడు, పొన్నూరు ఇన్‌చార్జిగా గాదె నాగేశ్వరరావు, మంగళగిరి ఇన్‌చార్జిగా షేక్ సలీం, తాడికొండ ఇన్‌చార్జిగా చిలకా విజయ్‌కుమార్, ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా కొరివి వినయ్‌కుమార్‌లను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి శ్రీపతి ప్రకాశం, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇన్‌చార్జి బిళ్లా సునిల్, గద్దం పాల్ విజయ్ కుమార్ పీసీసీ ప్రధాన కార్యదర్శి బొట్ల బ్రహ్మయ్య రాహుల్, యూత్ అధ్యక్షులు మల్లెల మోషే పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం




ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

కాకుమాను: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారి జోగి మోహనరావు మాట్లాడుతూ నేటి విద్యార్థులు విద్యతో పాటు పుస్తక పఠనం, చిత్రలేఖనం, వ్యాస రచన వంటి పోటీలలో పాల్గొనాలని సూచించారు. పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం, ప్రశాంతత, మేధాశక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రత్తిపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం లైబ్రేరియన్ బి.అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.మేరిజ్యోతి, ప్రథమ స్థానం సాధించగా, అక్షయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు వి.వైష్ణవి రాణి ద్వితీయ స్థానం, ఎ.ప్రణీతి తృతీయ స్థానం, డి.వెంకట కార్తిక్ కన్సోలేషన్ బహుమతి సాధించారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులను అందించడం జరుగుతుందని అరుణ తెలిపారు.

పెదకాకాని: స్థానిక లూథర్‌గిరి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి గోళ్ల స్వరూపరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లైబ్రేరియన్ వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు రాహేలు, జ్యోత్స్న, బీవీఆర్ స్కూల్ ఉపాధ్యాయులు మహేంద్ర, పుస్తక పంపిణీ కేంద్రం నిర్వహకురాలు మాధవి లత విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్‌లో మిక్స్ అండ్ మింగిల్ వేడుకలు



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. శనివారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో మిక్స్ అండ్ మింగిల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్‌రోజ్, జి.రాధిక, ఉష పాల్గొన్నారు.

బాలోత్సవ్



వీవీఐటీ బాలోత్సవ్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



గ్రామీణ మహిళ వేషధారణ



మట్టిపాత్రలు తయారీని తిలకిస్తున్న విద్యార్థులు



విద్యార్థులు ప్రదర్శించిన నాటికలో ఓ దృశ్యం

-పెదకాకాని

అయ్యప్ప స్వాములకు సద్ది ప్రారంభం

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో ఏంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారులు చంద్రశేఖరశర్మ నిర్వహణలో చతుర్దశ(14 వ) అన్నప్రసాద సద్ది వితరణ శనివారం ప్రారంభమైంది. ఉదయం గోపూజ, గణపతి హోమం, అయ్యప్పస్వామికి శరణుఘోషతో విశేషాభిషేకాలు జరిగాయి. అయ్యప్పలకు, భవానీలు, శివ స్వాములు, మాల ధరించిన స్వాములకు ఈనెల 16 నుంచి వచ్చేనెల 26 సద్ది కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం జె.రాముగురుస్వామి (విజయవాడ) నిర్వహణలో పదునెట్టాంపడి పూజలు వైభవంగా జరిగాయి. పూర్ణచంద్రరావు బృందం నిర్వహించిన అయ్యప్ప భజన అలరించింది. మహాహారతి అనంతరం అయ్యప్ప స్వామికి పుష్పాభిషేకం, తీర్థ ప్రసాద వితరణ, బిక్ష కార్యక్రమాలు జరగ్గా, గుంటూరు వేమారెడ్డి, పాలకవర్గం పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా పనిచేయాలి


డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి

ప్రత్తిపాడు: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా మనమంతా పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏపీఎం లాజరు అధ్యక్షతన వీఓఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి స్త్రీనిధి, ఉన్నతి రుణాలు, రికవరీ, స్వయం ఉపాధి యూనిట్లు, మొబైల్ బుక్ కీపింగ్, సంఘాల ప్రగతి.. వంటి పలు అంశాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి టార్గెట్లుకు అనుగుణంగా ప్రతి ఒక్క వీఓఏ పనిచేయాల్సిందేనన్నారు. ప్రతి మండలంలో మహిళా మార్టులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉన్నతి రుణాలకు సంబంధించి మండలానికి రూ.కోటి టార్గెట్ ఉందని, ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఇచ్చే వడ్డీ లేని రుణం ఉన్నతి అని వివరించారు. అదేవిధంగా రుణాల రికవరీపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వీవోఏలు సక్రమంగా పని చేయకపోతే, సంబంధిత గ్రామ సంఘాలకు నోటీసులిచ్చి, పని చేయని వారిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా జిల్లాలో షీ ఆటోలు ఇచ్చేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సమీక్షకు ఐబీ డీపీఎం కామేశ్వరి, స్త్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్, బ్యాంక్ లింకేజీ డీపీఎం కేశవ్, ఎంపీడీఓ కె.శివపార్వతి, ఏపీఎం లాజరు పాల్గొన్నారు.

నేషనల్ లెవెల్ ప్రొటోటైప్ ఛాలెంజ్ పోటీలు



గుంటూరు రూరల్: నూతన ఆవిష్కరణలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే విధంగా ఉండటం అభినందనీయమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో రూపజ్ఞా- 2024 పేరుతో నేషనల్ లెవెల్ ప్రొటోటైప్ ఛాలెంజ్ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. స్మార్ట్ ఎడ్యుకేషన్ అండ్ స్మార్ట్ ఆటోమేషన్, క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీ, మెడ్ టెక్, బయోటెక్, హెల్త్ టెక్ , అగ్రి టెక్, ఫుడ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేటివ్ సొల్యూషన్స్, యూసింగ్ వెబ్, మొబైల్ అప్లికేషన్స్ ఫర్ సోషల్ ప్రాబ్లమ్స్ అనే అంశాలపై జరిగిన జాతీయ స్థాయి పోటీలలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాశాలల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తమ జట్లను, వారి నూతన ఆవిష్కరణల నమూనాల వివరాలను, వాటి పనితీరులను నమోదు చేసుకున్నారు. వాటిని రెండు విడతలుగా పోటీల నిర్వాహకులు పరీక్షలు జరిపి అనంతరం వాటి నుంచి ఫైనల్స్‌కు 20 జట్లు ఎంపిక చేశారు. అందులో 11 జట్లు భౌతిక నమూనాల పనితీరును ప్రదర్శించగా, 9 జట్లు సాఫ్ట్ వెర్ అప్లికేషన్స్‌ను ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు చెందిన రెండు జట్ల విద్యార్థులు ప్రథమ స్థానాలలో నిలిచి పది వేల రూపాయల రూపాయల నగదు బహుమతిని, మెమెంటోలను, సర్టిఫికెట్లను పొందారు. అదే విధంగా ఆర్‌వీఆర్‌జేసీ జట్టు, హైదరాబాద్ జేఎన్‌టీయూ కళాశాల జట్లు ద్వితీయ స్థానాలలో నిలిచి ఆరు వేల రూపాయల నగదు బహుమతిని, సర్టిఫికెట్లను, మెమెంటోలను పొందారు. చెన్నై, పనిమానార్ కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచి నాలుగు వేల రూపాయల బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్, సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ కె.కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎంపీపీ చంద్రశేఖర్, మహేంద్రవర్మ, ఎస్.రాధిక, కె.శోభ, కె.కార్తీకపవన్, సాహిత్యచంద్ర, శాలేంరాజు, వీవీఎస్ సుధీర్, లక్ష్మీతులసి విజేతలను అభినందించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — ప్రత్తిపాడు బ్రాంచి, చిరునామా: ప్రత్తిపాడు గ్రామము మరియు మండలం, గుంటూరు జిల్లా, ఏపీ-522019. ఫోన్: 0863-2280224

బంగారు నగల వేలము నోటీసు

[illegible] ది.22.11.2024, శుక్రవారం, సా॥ 4-00 గంటలకు [illegible] ది.22.11.2024, మధ్యాహ్నం 2-00 గంటలకు [illegible] రూ.10000/- [illegible]

ఖాతాదారుని పేరు మరియు చిరునామా	ఖాతా నెంబరు	స్థూల బరువు (గ్రాములలో)	నికర బరువు (గ్రాములలో)
ఎనిరెడ్డి ఇంద్రారెడ్డి, తండ్రి: వెంకటరెడ్డి, పెదయపు పాలెం, ప్రత్తిపాడు (పోస్ట్) (మం), గుంటూరు జిల్లా, ఏపీ	043661640000 4272	34.40 గ్రా.	26.00 గ్రా.
	043661640000 4273	64.00 గ్రా.	47.00 గ్రా.
	043661654000 04274	68.00 గ్రా.	57.00 గ్రా.

తేదీ: 16.11.2024, ప్రదేశం: ప్రత్తిపాడు — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com